పండగ వేళ.. ట్రాఫిక్ గోల!


ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఆపడంతో స్తంభించిన ట్రాఫిక్

- ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద పెరుగుతున్న రద్దీ
- సమస్యగా మారుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు
- అడ్డదిడ్డంగా గంటల తరబడి నిలిపేస్తున్న వైనం
- విద్యార్థులకూ తప్పని ఇక్కట్లు



శ్రీకాకుళం క్రైమ్ : సంక్రాంతి పండగ నేపథ్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్‌తో పాటు పరిసరాలు వాహనాలతో కిక్కిరిసిపోతున్నాయి.ముఖ్యంగా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు ఇష్టారాజ్యంగా రోడ్డుపై నిలిపివేస్తుండటంతో ట్రాఫిక్ స్తంభించిపోతోంది. వాస్తవానికి ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను నిలిపేందుకు ఎన్‌హెచ్–16 హైవే దరి డెంటల్ కాలేజీ నుంచి ఆమదాలవలస–శ్రీకాకుళం హైవే బ్రిడ్జి జంక్షన్ వరకు అనుమతి ఉన్నా.. నిర్దేశిత సమయం కంటే గంట ముందే కంట్రోల్(టికెట్) పాయింట్ వద్దకు వచ్చేస్తున్నాయి. నిత్యం రద్దీ (ఒకేచోట జిల్లా కోర్టు, తహసీల్దార్ కార్యాలయం, ఎస్పీ ఆఫీస్, ట్రెజరీ, స్కూళ్లు, హాస్పిటల్స్) ఉండే ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద ప్రయాణికులను ఎక్కించే నెపంతో ఇంకాస్తా ఆలస్యం చేస్తూ.. వాహనచోదకులను మరింత అసహనానికి గురిచేస్తున్నారు. పండగ వేళలే కాకుండా కళాశాలలు, స్కూళ్లు వదిలే సాయంత్రం సమయంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. బలగ పెట్రోల్ బంక్ నుంచి డేఅండ్‌నైట్ కూడలి వరకు సాయంత్ర సమయాల్లో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోతుండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. ట్రాఫిక్ పోలీసులు స్పందించి ప్రైవేటు బస్సులు, ఇతర వాహనాలు కాంప్లెక్స్ పరిసరాల్లో నిలుపుదల చేయకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, విద్యార్థులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..



ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు సాయంత్రం వేళ ట్రాఫిక్‌కు ఇబ్బంది పెడుతున్న మాట వాస్తవమే.. వారికి పలుమార్లు కౌన్సిలింగ్ ఇచ్చాం. ఉదయం పూట హైవేలో డెంటల్ కాలేజీ నుంచి పెట్టుకోవడానికి అనుమతినిచ్చాం. ప్రయాణికులకు ఎక్కించే సాయంత్రవేళల్లోనే ఇబ్బంది తలెత్తుతోంది. వాహనచోదకులకు, కాలేజీ విద్యార్థులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకుంటాం.

– సీహెచ్‌వీవీ ప్రసాదరావు, ట్రాఫిక్ డీఎస్పీ

అరగంటకు పైగా ఆపేస్తున్నారు..



పట్టణంలో ప్రయివేటు కళాశాలలో డిప్లమో చదువుతున్నాను. మాకు లిమిటెడ్‌గా ప్రభుత్వ ఆర్టీసీ బస్సులున్నాయి. కళాశాల వదిలే సమయం, బస్సు బయలుదేరే సమయం ఒకటే. నిమిషం కూడా కాంప్లెక్స్ బయట ఆర్టీసీ బస్సులు ఆపకపోవడంతో పాస్ ఉన్నా ఆటోలో వెళ్లాల్సి వస్తుంది. మేమొచ్చే సమయంలోనే ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు ఒక్కొటి అరగంటకు పైగా కాంప్లెక్సు ముందు ఆపేస్తున్నారు.

– లక్ష్మీనారాయణ, డిప్లమో విద్యార్థి, బత్తిలి

ఇబ్బందిపడుతున్నాం..



పట్టణంలో ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్ చదువుతున్నాను. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే మా క్లాస్ మేట్స్ కొన్నిసార్లు ఆర్టీసీ బస్సు కాంప్లెక్సులోపలే ఆపడం.. బయట రెండు నిమిషాలైనా ఆపకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు కాంప్లెక్స్ ఎదుట నిలుపుదల చేసేందుకు ఎలా చాన్స్ ఇస్తున్నారు?

– రమేష్, బీటెక్ విద్యార్థి, ఆమదాలవలస

చోటు లేకే..



ట్రావెల్స్ బస్సులో సిబ్బందిగా పనిచేస్తున్నాను. బస్సులు నిలుపుకోవడానికి చోటులేక ఇబ్బంది పడుతున్నాం. ఏవైనా వెహికల్స్ వస్తే మేం ఆ ప్రదేశంలో ఉన్నా వెంటనే బస్సును తీయాల్సి ఉంటుంది. పర్మినెంటుగా మా బస్సులు నిలిపేందుకు చోటు ఉండేలా ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– మణికంఠ, ట్రావెల్ సిబ్బంది

శ్రీరాములునాయుడు సేవలు చిరస్మరణీయం


గొర్లె శ్రీరాములునాయుడు విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: నీతి, నిజాయితీ పాలనకు కేరాఫ్‌గా నిలిచి సిక్కోలు చరిత్రలో చెరగని ముద్ర వేసిన మహానుభావుడు దివంగత గొర్లె శ్రీరాములునాయుడని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ కొనియాడారు. మండల కేంద్రం రణస్థలంలో ఆదివారం శ్రీరాములునాయుడు 18వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నిరుపేదలకు దుస్తులు, ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం ఎన్నో సాగునీటి ప్రాజెక్టులు నెలకొల్పి జిల్లాను సస్యశ్యామలం చేయడంలో కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు, మత్స్యకారులకు సంక్షేమ పథకాలు అందించడం, మారుమూల గ్రామాలకు తారు రోడ్లు వేయడం వంటి సదుపాయాలు కల్పించారని చెప్పారు.

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, మండల నాయకులు కురిటి రామకోటి, గొర్లె అప్పలనాయుడు, మహంతి పెదరామినాయుడు, జె.ఆర్.పురం సర్పంచ్ బవిరి రమణ, వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, రణస్థలం ఎఫ్ఎస్‌సీఎస్ అధ్యక్షులు కరిమజ్జి భాస్కరరావు, పాతర్లపల్లి సర్పంచ్ గొర్లె రాధాకృష్ణ, నాయకులు మహంతయ్య, పిన్నింటి లక్ష్మునాయుడు, గొర్లె లక్ష్మణరావు, పిన్నింటి సత్యంనాయుడు, కరిమజ్జి రమణ, టేకి బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

సొంతనిధులతో శ్వేతగిరికి మెట్ల నిర్మాణం


మెట్లు నిర్మించిన దృశ్యం

గార: శ్వేతగిరిపై కొలువుదీరిన కాళీయ మర్దన వేణుగోపాలస్వామిని మెట్ల మార్గం గుండా దర్శనం కోసం వెళ్లే భక్తుల కోసం ఆలయ అనువంశిక ధర్మకర్త సుగ్గు మధురెడ్డి దంపతులు రూ. 5.60 లక్షలతో సిమెంట్ మెట్లు నిర్మించారు. గతంలో రాతి మెట్లు ఉన్నా పూర్తిగా పాడయ్యాయి. వచ్చే నెలలో భీష్మ ఏకాదశి పురస్కరించుకొని గిరియాత్ర జరగనుండగా. సుమారు లక్ష మంది భక్తులు వచ్చే అవకాశముంది. ఈ మెట్ల మార్గం గుండానే స్వామి మూర్తులను వంశధార నదిలోకి చక్రతీర్థ స్నానానికి తీసుకెళ్తారు. ఈ నేపథ్యంలో మెట్ల మార్గాన్ని పటిష్టం చేశారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం


మురపాక గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

లావేరు: పుస్తక పఠనంతో జ్ఞానం లభిస్తుందని మురపాక, లావేరు గ్రంథాలయాల లైబ్రేరియన్ మురపాక శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం స్థానిక గ్రంథాలయాల్లో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. బాలసాహిత్యం, కథలు, జాతీయ నాయకుల జీవిత చరిత్ర, రామాయణం, బైబిల్, ఖురాన్‌తో పాటు అనేక పుస్తకాలను ప్రదర్శనకు ఉంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకపై ప్రతి నెలా మొదటి ఆదివారం గ్రంథాలయాల్లో పుస్తక ప్రదర్శన నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు పి.షణ్ముఖరావు, ఎ.గడ్డెయ్య తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన కాంప్లెక్స్


పల్లెవెలుగు బస్సు వద్ద ప్రయాణికుల రద్దీ

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్రమైన ఆర్టీసీ కాంప్లెక్స్ ఆదివారం ప్రయాణికులతో రద్దీగా కనిపించింది. సంక్రాంతి నేపథ్యంలో చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వంటి సుదూరప్రాంతాల నుంచి స్వగ్రామాలకు జనం భారీగా చేరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం, బత్తిలి, పాతపట్నం తదితర దూరప్రాంత బస్సులు కిటకిటలాడాయి. పల్లెవెలుగులు సైతం రద్దీగా కనిపించాయి.

ఆకట్టుకున్న పౌరాణిక ప్రదర్శనలు


కళాకారుడిని సత్కరిస్తున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బాపూజీ కళామందిర్‌లో ఆదివారం ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన ఏకపాత్రాభినయాల ప్రదర్శన ఆకట్టుకుంది. జిల్లా టీడీపీ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రదర్శనలో 15 మంది కళాకారులు శ్రీకృష్ణదేవరాయలు, దుర్యోధనుడు, శ్రీకృష్ణ, లంకేశ్వరుడు, నారథుడు, సత్యహరిశ్చంద్ర, రావణబ్రహ్మ వంటి పాత్రలతో అలరించారు. అనంతరం జరిగిన సభలో ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు చేతుల మీదుగా కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కిమిడి కళావెంకటరావు, గుండ అప్పలసూర్యనారాయణ, గుండ లక్ష్మీదేవి, గౌతు శిరీష, కూన రవి కుమార్, గుత్తు చిన్నారావు పాల్గొన్నారు.

కూర్మనాథుని సన్నిధిలో ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్


బాలనాయక్‌కు ఆశీర్వచనాలు అందజేస్తున్న అర్చకులు

గార: శ్రీకూర్మంలోని కూర్మనాథున్ని ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ బాలానాయక్ ఆదివారం సతీసమేతంగా దర్శించుకున్నారు. ముందుగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ సంప్రదాయాలతో అధికారులు స్వాగతం పలికారు. ఎమ్మెల్సీ అనంతబాబు, ఇరిగేషన్ సూపరింటెండెంట్ వీఎస్ఎన్ మూర్తి కూడా స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఈవో జి.గురునాథరావు, పాలకమండలి సభ్యుడు డి.శ్రీనివాసు పాల్గొన్నారు.

సత్యసాయి క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

గార: గోరువానిపేటలోని సత్యసాయి జన్మదిన వేడుకల్లో భాగంగా ఆదివారం జిల్లా పదాధికారుల ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పఠనం జరిగింది. సత్యసాయి భజన మండలి జిల్లా అధ్యక్షుడు లింగరాజు, జోనల్ ఇన్‌చార్జి నాగేశ్వరరావు, కో ఆర్డినేటర్ మూర్తి, రామచంద్రరావు, బోయిన నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు. అనంతం సత్యసాయి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. యూత్‌డేలో భాగంగా నారాయణ సేవ జరిగింది.

రైతులకు రూ.20.50 కోట్ల వ్యవసాయ రుణాలు


రుణాలు రెన్యువల్ చేయిస్తున్న సీఈఓ సత్యనారాయణ, సిబ్బంది

లావేరు: మండలంలో 4300 మంది రైతులకు లావేరు పీఏసీఎస్ ద్వారా రూ.20.50 కోట్ల మేర వ్యవసాయ రుణాలు అందజేసినట్లు పీఏసీఎస్ సీఈఓ మీసాల సత్యనారాయణ తెలిపారు. స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో ఆదివారం వ్యవసాయ రుణాల రెన్యువల్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణాలు తీసుకున్న రైతులు ఈ నెల 15లోగా రెన్యువల్ చేయించుకుంటే 4 శాతం వడ్డీ పడుతుందన్నారు. ఆ తర్వాత 7 శాతం వడ్డీతో రుణాలు రెన్యువల్ చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. రైతులు వేలిముద్రల ఆధారంగా వచ్చే భూముల వన్‌బీ, ఆధార్ జిరాక్సు, వడ్డీ డబ్బులతో కార్యాలయానికి రావాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సిబ్బంది వాళ్లే దాలినాయుడు, తమ్మినాయుడు, రవి, సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు చినజీయర్ స్వామి పర్యటన

సారవకోట: మండలంలోని చీడిపూడి వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం నిర్వహించనున్న ధనుర్మాస ఉత్సవాలను సందర్శించేందుకు అహోబిళం చినజీయర్ స్వామి రానున్నట్లు ఆలయ అర్చకులు రామానుజాచార్యులు ఆదివారం తెలిపారు. ఆలయంలో ప్రత్యేక, విశేష పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారన్నారు. ఆధ్యాత్మిక ప్రవచనాలు చేయనున్నట్లు తెలిపారు.

గడ్డి కుప్పలు దగ్ధం

జలుమూరు: పాగోడు పంచాయతీ వెలుసోదలో ఏడు ఎకరాలకు చెందిన వరి గడ్డి కుప్పలు ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో కాలి బడిదయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రమాదవశాత్తు జరిగిన ఈ ఘటనలో గ్రామానికి చెందిన గొల్లంగి శ్రీరాములు, భూలోకడుకి చెందినవి. గ్రామస్తులు ఇచ్చిన సమాచారంతో కోటబొమ్మాళి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే గడ్డి కుప్పలు కాలిపోయాయి. బాధితులను సర్పంచ్ దామ మన్మథరావు, ఎంపీటీసీ చందనబాబు పరామర్శించారు.

75 వేల చేప పిల్లల పంపిణీ

పాతపట్నం: మండలంలోని పాతపట్నం, లాబర గ్రామాలకు చెందిన గిరిజనులకు 75 వేల చేప పిల్లలను పంపిణీ చేసినట్లు మత్స్యశాఖ అధికారులు రవికుమార్, సుదర్శనరావు తెలిపారు. లాబర సమీపంలోని చేరువులో 50 వేల చేప పిల్లలను ఆదివారం విడిచిపెట్టారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ అధికారి సుదర్శనరావు మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజనులకు అన్ని విధాలుగా ఆదుకుంటుందని, మత్స్యశాఖ ఆధ్వర్యంలో గిరిజన గ్రామాల్లో ఉన్న చేరువుల్లో చేపపిల్లలను పంపిణీ చేయనుందన్నారు. పాతపట్నం గ్రామానికి 25 వేలు చేప పిల్లలు పంపిణీ చేశారు. దొర ప్రసాదరావు, మల్లిపురం గోవిందరావు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా పింఛన్లు


బుడుమూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఏపీ అర్బన్ ఫైనాన్స్ డైరెక్టరు రమేష్‌బాబు


దేవరవలసలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

లావేరు: అర్హులందరికి పార్టీలకు అతీతంగా పింఛన్లు మంజూరు చేస్తున్నట్లు ఏపీ అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ కింతలి రమేష్‌బాబు అన్నారు. లావేరు మండలం బుడుమూరులో నూతనంగా మంజూరైన పింఛన్లను ఆదివారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారదర్శకంగా పథకాలు వర్తింపజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వలంటీర్లు పాల్గొన్నారు.

- జి.సిగడాం: పేదరికం నిర్మూలనే రాష్ట్ర ప్రభుత్వం ధ్యేయమని జిల్లా సెంట్రల్ బ్యాంకు మాజీ డైరెక్టర్ తిరుమరెడ్డి గౌరీశంకరావు అన్నారు. దేవరవలస సచివాలయం వద్ద కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరుమరెడ్డి వెంకటరావు, ఎంపీటీసీ తిరుమరెడ్డి విజయలక్ష్మి, లక్ష్మణరావు, జక్కంపూడి దాస్ తదితరులు పాల్గొన్నారు.

పూడికల తొలగింపు


వేణుగోపాలపురంలో పూడికలు తీయిస్తున్న దృశ్యం

లావేరు: మండలంలోని వేణుగోపాలపురం, గుమడాం గ్రామాల్లో ఆదివారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గుమడాం సర్పంచ్ గంధవరపు పైడయ్య, ఉప సర్పంచ్ దురగాసి ధర్మారావు ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికులతో కాలువల్లో పూడికలు తీయించారు. మురుగునీరు ఉన్నచోట బ్లీచింగ్ చల్లించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

విశేష గ్రంథం వివేక చూడామణి

శ్రీకాకుళం కల్చరల్: వివేక చూడామణి ఎంతో విశేషమైనదని, జ్ఞానేంద్రియాల గురించి చక్కగా వివరించారని దూసి సూర్యనారాయణ అన్నారు. ఉపనిషన్మందిరంలో వివేకచూడామణి గ్రంథం సారాంశాన్ని ఆదివారం వివరించారు. కార్యక్రమంలో మందిర ప్రతినిధులు పతంజలి శాస్త్రి, బాబూరావు, కామేశ్వరరావు, నాగేశ్వరరావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దీపారాధన


శివబాలాజీ ఆలయంలో దీపారాధన


దూదివారి కోవెలలో దీపాలతో మహిళలు


నారాయణ తిరుమలలో సహస్ర దీపాలంకరణ

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నారాయణ తిరుమల వేంకటేశ్వరస్వామి దేవాలయంలో తిరుప్పావై ప్రవచనాలలో భాగంగా ఆదివారం సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవ మూర్తులను వేదికపై ఉంచి వెయ్యిదీపాలు వెలిగించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త, రిటైర్డ్ హైకోర్టు జడ్జి గురుగుబెల్లి యతిరాజు తదితరులు పాల్గొన్నారు. బ్యాంకర్స్ కాలనీలోని శివబాలజీ ఆలయంలో అర్చకులు గోపినంబాళ్ల సీతారామాచార్యులు, సత్యకూర్మాచార్యుల ఆధ్వర్యంలో దీపారాధన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు జి.తులసీరావు, సామంత్, భక్తులు పాల్గొన్నారు. చిన్నబజారులోని దూదివారి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో మహిళలు దీపారాధన నిర్వహించారు. అర్చకులు రెజేటి శ్రీనివాచార్యులు నేతృత్వంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

క్లుప్తంగా

నేడు లావేరులో బడ్జెట్ సమావేశం

లావేరు: లావేరు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం బడ్జెట్ సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ వి.విశ్వేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

రథసప్తమి పనులకు రూ.50 వేల విరాళం


ఈవోకు నగదు అందజేస్తున్న దాతలు

అరసవల్లి: అరసవల్లిలో రథసప్తమి వేడుకల్లో భాగంగా పెయింటింగ్ పనుల కోసం తూర్పు గోదావరి జిల్లా అనపర్తికి చెందిన మండా వీర వెంకట సత్యనారాయణ రెడ్డి కుటుంబసభ్యులు రూ.50 వేల విరాళ నగదును ఈఓ హరిసూర్యప్రకాష్‌కు అందజేశారు. కాగా, ఆదివారం ఒక్కరోజున దర్శన టికెట్ల విరాళాలు, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2.44 లక్షల వరకు ఆదాయం లభించినట్లు ఈఓ వివరించారు.

'చదవడం మాకిష్టం'


పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ జి.నీలమ్మ మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించారు.

యువతకు ఆదర్శప్రాయుడు కమల్

శ్రీకాకుళం: చిన్న వయసులో ఎన్‌డీయేలో టాప్ ర్యాంకు సాధించి ఆర్మీలో లెఫ్టినెంట్ కల్నల్ స్థాయికి ఎదిగి జిల్లా కీర్తి ప్రతిష్టను జాతీయ స్థాయిలో నిలిపిన ఎం.కమల్ హసన్ యువతకు స్ఫూర్తిదాయకమని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో కమల్‌ను అభినందించారు. కార్యక్రమంలో కమల్ తల్లి మునికోటి మాధవి, వాకర్స్ ఇంటర్నేషల్ ప్రతినిధులు జి.ఇందిరాప్రసాద్, ఎస్.జోగినాయుడు, బి.వి.రవిశంకర్, క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధి ఎస్.ప్రభాకరరావు, శివ్వాల తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుడికి బ్యాగ్ అప్పగింత


శంకరరావుకు బ్యాగ్‌ను అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్సుకు ఆదివారం పి.శంకరరావు అనే ప్రయాణికుడు ప్రయాణించాడు. శ్రీకాకుళం సమీపంలోని చిలకపాలెంలో ట్రావెల్ బ్యాగ్‌ను మరచిపోయి దిగిపోయాడు. బ్యాగ్‌ను బస్సు డ్రైవర్ గుర్తించి కాంప్లెక్స్‌లోని ఎస్ఎం వి.శామ్యూల్‌కు అప్పగించారు. అందులో ఫోన్ నంబరు ఆధారంగా శంకరరావుకు ఫోన్ చేసి బ్యాగ్ అప్పగించారు. కార్యక్రమంలో ఆర్టీసీ కంట్రోలర్ పలిశెట్టి దామోదరరావు, ఆర్టీసీ టీఐ–3 ఎల్.ఎస్.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

రణస్థలం: మండల కేంద్రంలోని జె.ఆర్.పురం గ్రామానికి చెందిన డాక్యుమెంట్ రైటర్, రంగస్థల కళాకారుడు బోనం గురుమూర్తి ఇటీవల గుండె శస్త్ర చికిత్స చేసుకున్న నేపథ్యంలో ఆయన్ను ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పరామర్శించారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకుడు రొంపిల్లి నాగరాజు తదితరులు ఉన్నారు.

'యువశక్తి'ని విజయవంతం చేయండి

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళంలో ఈ నెల 12న జనసేన అధినేత పవన్ కల్యాణ్ నిర్వహించనున్న యువశక్తి సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ నేత బాడాన వెంకట జనార్దనరావు పిలుపునిచ్చారు. ఎచ్చెర్లలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ టికెట్ ఎవరికి ఇచ్చినా కట్టుబడి పనిచేస్తామని చెప్పారు. సమావేశంలో శ్రీనివాస్, అర్జున్ భూపతి పాల్గొన్నారు.